క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

భద్రాచలంటౌన్: భద్రాచలం క్రీడాకారులు జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఏపీలోని విజయనగరం జిల్లా రాజాంలో ఈనెల 12 నుంచి జరిగే జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు పట్టణంలోని సీటీ స్టైల్ జిమ్ క్రీడాకారులు మహతి వెంకటకృష్ణ, మహ్మద్ అబ్బాస్, గాలి రామ్మోహన్ రావు హాజరుకానున్నారని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భోగాల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను శ్రీనివాసరెడ్డితో పాటు మల్లేష్, తిరుమలరావు తదితరులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భద్రాచలంఅర్బన్: విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున భద్రాచలం పట్టణంలో శనివారం ఉదయం 9.30 నుంచి 12.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ వేణు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలం పట్టణ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వడ్డెర సంఘం కమిటీ ఎన్నిక

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని సమ్మక్క సారక్క ఫంక్షన్ హాల్లో శుక్రవారం భద్రాచలం పట్టణ వడ్డెర సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా గుంజా వెంకటేశ్వర్లు (బాబు), అధ్యక్షుడిగా గుంజా ఏడుకొండలు, ఉపాధ్యక్షుడిగా వల్లెపు వెంకన్న, సహాయ కార్యదర్శిగా గుంజ చెన్నకేశవ, కోశాధికారిగా వేముల సంతోష్ కుమార్, ప్రచార కార్యదర్శిగా వేముల బాలకృష్ణలు ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా పీట్ల శివ, గుంజ రామారావు, గుంజ శ్రీరామ్, డేరంగుల ఏడుకొండలు, దండగుల రామకృష్ణ, విజయ్, కేశవ, గోపి, దుర్గారావు, సాయిలు, పల్లపు సమ్మయ్యలు ఎన్నికైనట్లు సంఘం జిల్లా అధ్యక్షులు పల్లపు లక్ష్మణ్ తెలిపారు.

చోరీపై కేసు నమోదు

అశ్వాపురం: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల సమీపాన భారజల కర్మాగారం రిటైర్డ్ ఉద్యోగి రాంప్రసాద్ ఫాం హౌస్‌లో జరిగిన ఫర్నీచర్ చోరీపై శుక్రవారం కేసు నమోదైంది. ఫాంహౌస్ ప్రధాన ద్వారం తలుపును గురువారం రాత్రి పగలగొట్టిన దుండగులు ఏసీ, గ్యాస్ స్టౌ, ప్లైవుడ్, సీసీ కెమెరా, గీజర్ ఎత్తుకెళ్లారు. ఈ మేరకు వాచ్‌మెన్ నర్సయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

ఆర్థికసాయం

ములకలపల్లి: మండలంలోని మంగలిగుట్ట గ్రామానికి చెందిన మడకం నవీన్ ఏడాది కొడుకు ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతుండగా వైద్య ఖర్చుల నిమిత్తం మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు రూ.5వేలు ఆర్థికసాయం శుక్రవారం అందజేశారు. సర్పంచ్ బైటి రాజేశ్, కాంగ్రెస్ నాయకులు చిన్నారి, బుగ్గారపు సత్యనారాయణ, కోరంపల్లి చెన్నారావు, జహీర్, శనగపాటి రవి తదితరులు ఉన్నారు.

దాతలు ఆదుకోండి..

మంగలిగుట్ట గ్రామానికి చెందిన మడకం నవీన్, శ్యామల దంపతుల ఏడాది కుమారుడు ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా ఆపరేషన్‌కు రూ.1లక్ష వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. తమ బాబును కాపాడుకునేందుకు దాతలు స్పందించి సాయం అందించాలని, 9703578915 నెంబర్‌కు ఫోన్ పే లేదా గూగుల్ పే చేయాలని నవీన్, శ్యామల కోరుతున్నారు.

బూర్గంపాడు: సారపాకకు చెందిన రావి అజయ్‌కుమార్ వెన్నెముక క్యాన్సర్‌తో గత కొంతకాలంగా బాధపడుతుండగా మోరంపల్లిబంజరకు చెందిన నేస్తం చారిటబుల్ వెల్ఫేర్ ట్రస్ట్ ప్రతినిధులు శుక్రవారం బాధితుడికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.6 వేల ఆర్థికసాయం అందించారు. ట్రస్ట్ చైర్మన్ బత్తుల రామకొండారెడ్డి, ఆవుల నాగార్జున, పేరం రామిరెడ్డి, బాల నాగిరెడ్డి, ఆవుల శివనాగిరెడ్డి పాల్గొన్నారు.

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో సాడె వెంకటేశ్వర్లు మనవరాలు ఇటీవల మృతి చెందగా దశ దినకర్మలకు సర్పంచ్ మర్రి మల్లారెడ్డి రూ.2,500 ఆర్థిక సాయం అందజేశారు. ఉపసర్పంచ్ మేడవరపు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

మణుగూరు రూరల్: మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలనుకునేవారు ఈనెల 14లోపు థర్డ్‌ఫేజ్‌లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యాబోధన, అన్ని రకాల మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దూర ప్రాంత విద్యార్థులకు హాస్టల్ వసతి, బస్‌పాస్ సౌకర్యంతో పాటు స్కాలర్‌షిప్ సౌకర్యం కూడా ఉందని పేర్కొన్నారు. పరీక్షల సమయంలో ప్రత్యేక తరగతులు నిర్వహణతో పాటు మధ్యాహ్న భోజన సదుపాయం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సంబంధిత ధ్రువపత్రాలతో కళాశాలలో సంప్రదించి రూ.400ల రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సమస్యలు డబుల్‌ఐనయ్!

దారి, సౌకర్యాలు లేక అమెర్దలో డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల అవస్థలు

- శిథిలావస్థకు చేరిన ఇళ్లు
- కనీస రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు



డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు వెళ్లే రహదారి దుస్థితి

అశ్వాపురం: భవనాలు శిథిలావస్థకు చేరి బీటలు బారుతూ వర్షాలకు కురుస్తూ రహదారి సౌకర్యం లేక మండల పరిధిలోని అమెర్ద గ్రామ పంచాయతీలోని డబుల్‌బెడ్‌రూం ఇండ్ల లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. మొదటి విడతలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పథకంలో భాగంగా మండల పరిధిలోని అమెర్ద పంచాయతీలో ప్రభుత్వ కార్యాలయాలకు సమీపంలో 40 ఇళ్లు నిర్మించారు. 2017 జనవరి 11న అప్పటి ఎమ్మెల్యే పాయం శంకుస్థాపన చేశారు. మూడేళ్లకు 2020 డిసెంబర్ 18న ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ఇళ్లను ప్రారంభించారు. 40 ఇళ్లకు 25 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లు పంపిణీ చేశారు. మిగతా 15 ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయలేదు. గ్రామంలో కొందరు ఇండ్లు లేని వారు డబుల్ బెడ్‌రూం ఇళ్లల్లో నివాసం ఉంటున్నారు.

శిథిలావస్థకు చేరిన భవనాలు..

ఇప్పటికే ఇళ్లు శిథిలావస్థకు చేరాయి. భవనాలు గోడలు బీటలు బారుతూ ఫ్లోరింగులు కుంగి పోతున్నాయి. భవనాలు బీటలు బారుతూపై కప్పులు, గోడల వెంబడి వర్షాలకు కురుస్తున్నాయి. భారీ వర్షాలు కురిస్తే ఇళ్లల్లో నీరు జలమయమవుతున్నాయి. ఇళ్లల్లో చేరిన మూడేళ్లకే ఇళ్లు శిథిలావస్థకు చేరి గోడలు బీటలు బారటం, ఫ్లోరింగ్ కుంగటంతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి భవనాలకు మరమ్మతులు చేయించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

రహదారి సమస్యతో అవస్థలు..

ఇళ్లకు రహదారి సౌకర్యం లేక లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. వర్షాలకు ఇళ్ల ఎదుట బురదమయమై ఇబ్బంది పడుతున్నారు. డబుల్‌బెడ్ రూం ఇళ్ల కాలనీలో రహదారి, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు ప్రభుత్వం కల్పించాల్సి ఉంది. తాగునీరు, విద్యుత్ సౌకర్యం ఉన్నా రహదారులు నిర్మించకపోవడంతో లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి రహదారులు నిర్మించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



బీటలు బారుతున్న గోడలు

శరవేగంగా అభివృద్ధి పనులు

అశ్వాపురం: మండలంలో ఎన్నడూ లేని విధంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని, పనులు శరవేగంగా సాగుతున్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. అశ్వాపురం మండల కేంద్రంలో రూ.4 కోట్లతో జరుగుతున్న డ్రెయినేజీ, సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులను శుక్రవారం ఎమ్మెల్యే రేగా కాంతారావు సందర్శించారు. డ్రెయినేజీ పనులు జరుగుతున్న తీరును ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న విప్ రేగా కాంతారావు

పార్టీలకతీతంగా అభివృద్ధే అభిమతం

- పోడు పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే మెచ్చా



విత్తనాలు నాటుతున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

ములకలపల్లి: ఇతర పార్టీలను విమర్శించనని, పార్టీలకతీతంగా అభివృద్ధే తమ అభిమతమని, ప్రభుత్వ పథకాలతో అన్నివర్గాల ప్రజలను ఆదుకుంటున్న సీఎం కేసీఆర్‌ను ఆదరించాలని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. మండలవ్యాప్తంగా శుక్రవారం విస్తృతంగా పర్యటించిన ఆయన 15 జీపీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 2,237 మంది లబ్ధిదారులకు పోడు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా 50 వేల ఎకరాల పోడు భూములకు హక్కుపత్రాలు తన చేతుల మీదుగా అందించడం ఆనందంగా ఉందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూస్తామన్నారు. ప్రస్తుతం పట్టాలు రానివారికి సైతం హక్కుపత్రాలు మంజూరయ్యేలా చూస్తామని భరోసా ఇచ్చారు. తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీఓ శ్రీను, ఈఓఆర్డీ లక్ష్మయ్య, ఏఈలు లక్ష్మీనర్సింహారావు, వరప్రసాద్, ఎంపీపీ మట్ల నాగమణి, ములకలపల్లి, దమ్మపేట జెడ్పీటీసీలు సున్నం నాగమణి, పైడి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు శనగపాటి మెహరమణి, నూపా సరోజిని, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, పామర్తి వెంకటేశ్వరరావు, పువ్వాల మంగపతి, పర్వతనేని అమర్‌నాథ్, పుష్పాల చందర్‌రావు, పాలకుర్తి ప్రసాద్, అడపా నాగేశ్వరరావు, కొండవీటి రాజారావు, కోమాళ్ల దుర్గాప్రసాద్, నందమూరి సురేశ్, ఏవీ రమణ, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పత్తి విత్తనాలు నాటిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు కాసేపు రైతుగా మారారు. పోడు పట్టాల పంపిణీ కోసం మండలంలోని గుండాలపాడుకు శుక్రవారం ఆయన వచ్చారు. తిరిగి వెళ్తున్న క్రమంలో రైతులు పత్తి విత్తనాలు నాటుతుండగా చూసి ఆయన కూడా కాసేపు విత్తనాలు నాటారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్సై, సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: వాహనాల చోరీ ఘటనల నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు శుక్రవారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అశ్వారావుపేటలోని జంగారెడ్డిగూడెం, ఖమ్మం రోడ్లలో సీఐ బాలకృష్ణ, ఎస్సై బి.రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో ద్విచక్రవాహనాలు, కార్లు, లారీలు, వ్యాన్లను నిలిపివేసి వాటికి సంబంధించిన పత్రాలను తనిఖీ చేశారు. అదే విధంగా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేసి, డ్రైవింగ్ లైసెన్సులు పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్సై మాట్లాడుతూ.. వాహనాలకు సంబంధించి అన్నీ పత్రాలు ఉండాలని, లేని పక్షంలో చర్యలు తప్పవన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ వాడాలని, మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

దమ్మపేట: ఆశ్రమ పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని ఆశ్రమ పాఠశాలను శుక్రవారం యూటీఎఫ్ సభ్యులు పరిశీలించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 9న భద్రాచలంలో నిర్వహించే సమావేశంలో ఆశ్రమ పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఐటీడీఏ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ఐటీడీఏ సబ్‌కమిటీ సభ్యులు నాగరాజు, రామారావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దుమ్ముగూడెం: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఆర్‌బీఎస్‌కె డాక్టర్ వినయ్ సూచించారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని కే రేగుబల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులందరికీ పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. హెచ్ఎం ధనసరి నాగమణి, డాక్టర్ శకుంతల, ఏఎన్‌యం కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను పరీక్షిస్తున్న డాక్టర్

వృత్తి విద్యా శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

మణుగూరు రూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీవీకాలనీలో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో అందించనున్న ఉచిత వృత్తి విద్య కోర్సుల శిక్షణకు ఏరియా మహిళలు, యువతులు దరఖాస్తు చేసుకోవాలని ఏరియా డీజీఎం(పర్సనల్) ఎస్.రమేష్ తెలిపారు. శుక్రవారం పర్సనల్ విభాగంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అనుభవజ్ఞులైన శిక్షకులతో బ్యూటిషియన్, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్స్, వివిధ రకాల బ్యాగులు, కంప్యూటర్ డీటీపీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తుతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోను జత చేసి ఈ నెల 20లోగా జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో అందజేయాలని సూచించారు.

కార్మికులకు లాభాల్లో వాటా చెల్లించాలి

మణుగూరు రూరల్: సింగరేణి బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతల్లో విశేష సేవలందిస్తున్న కార్మికులందరికి లాభాలలో 35శాతం వాటా చెల్లించాలని ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వెలగపల్లి జాన్ యాజమాన్యానికి డిమాండ్ చేశారు. శుక్రవారం యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర విద్యుత్ పరిశ్రమల నుంచి సింగరేణికి రావాల్సిన రూ.18 కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత తీసుకుని ఇప్పించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు టి.పెద్దనాగయ్య, బి.రాజలింగు, ముత్తేశ్వరరావు, డీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీలో 'లిటిల్ ఫ్లవర్స్' ప్రతిభ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం మెడికల్ కాలనీలోని లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులు ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. ఎంపీసీలో బి.మాధుర్య 465, పూజిత 464, ప్రవళిక 464, యశస్వా 463, చరణ్య 462 మార్కులు సాధించి జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిచారు. బైపీసీ విభాగంలో ఎండీ సమ ఆర 434, నికిత్‌కుమార్ 432, రామతన్మయ్ 417 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్స్ మాగంటి రమేష్‌బాబు, ప్రసాద్ బాబులు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

చంద్రుగొండ : మండలకేంద్రం చంద్రుగొండలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద జెండా విష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చాపలమడుగు వెంకటేశ్వర్లు, మండలాధ్యక్షుడు మధు, వారాధి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు రూరల్: మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో మాన్యశ్రీ మంద కృష్ణ మాది జన్మదినోత్సవం, ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అర్ర కనకయ్య, కొమ్ము హుస్సేన్, బోయిళ్ల నరసింహారావు, ఉసికెల కొండయ్య, చెక్క రమేష్, బాబురావు, దుర్గాప్రసాద్, వెంకటేశ్వర్లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

గుండాల: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధుల నుంచి రక్షణ పొందుతామని వైద్యాధికారి మనీష్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తూరబాక గ్రామంలో ఫ్రైడే–డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాలలో నీరు నిల్వలేకుండా చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి, రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ శ్రీహరి, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ సత్యం, ఏఎన్ఎం భువనేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ వీర రాఘవులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



గుండాల: నిల్వనీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

మణుగూరు రూరల్: మండలంలోని లంకమల్లారం గ్రామంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలోని గురుకులంలో వైద్యశిబిరం నిర్వహించి విద్యార్థులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్యసిబ్బంది రాంప్రసాద్, సుమ, విజయ, శైలజ, భవాని, సిబ్బంది పాల్గొన్నారు.



మణుగూరు రూరల్: లంకమల్లారంలో..

జ్వర పీడితులకు వైద్యం అందించాలి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం, గుమ్మడవల్లి పీహెచ్‌సీ పరిధిలో గిరిజన గ్రామాల్లో ర్యాపిడ్ ఫీవర్ సర్వేను నిర్వహించారు. ఈ సర్వేలో భాగంగా పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రాందాస్ నాయక్, డాక్టర్ మధుశిక ఇంటింటికి వెళ్లి జ్వర పీడితుల గురించి వివరాలు సేకరించారు. ఆయా గ్రామాల్లో మొత్తం 97 మంది సాధారణ జ్వరాలతో బాధ పడుతున్నట్లు గుర్తించి వైద్య సేవలు అందించారు. ఇళ్ల పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, సిబ్బంది శ్రీను, విజయ్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: మండల వ్యాప్తంగా శుక్రవారం ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాపిడ్ ఫీవర్ సర్వేను ప్రారంభించారు. ప్రతీ నెల 7 నుంచి 17 వరకు గ్రామాల్లో సర్వే నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారిణి డా.ప్రియాంక తెలిపారు. ఈ కార్యక్రమంలో తన్మయి, సీహెచ్ఓ పులమ్మ, డీపీఎంఓ వెంకటేశ్వరరావు, హెచ్ఈఓ కృష్ణయ్య, హెచ్ఎస్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



అన్నపురెడ్డిపల్లిలో..



అశ్వారావుపేటరూరల్: జ్వరసర్వే..

గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి

భద్రాచలం: బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలను బూత్ స్థాయిలో ప్రజలకు వివరించి కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొదెం వీరయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో మండలాధ్యక్షుడు సరెళ్ల నరేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ నెరవేర్చని హామీలను, ప్రజలకు చేసిన అన్యాయాలను వివరించాలన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతిరేల రవికుమార్, నాయకులు అడబాల వెంకటేశ్వరరావు, భోగాల శ్రీనివాసరెడ్డి, బలుసు నాగ సతీష్, బంధం శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్, రాము, చింతిరేల సుధీర్, ఎడారి ప్రదీప్, మణికంఠ, నిఖిల్, మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు వసంతల రాజేశ్వరి, సరిత, దేవకి, నీరజ పాల్గొన్నారు.



భద్రాచలం: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య

అధికారంలోకి రాగానే అందరికీ హక్కుపత్రాలు..

చర్ల: ఆరు నెలల తరువాత రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందనే ఆ వెంటనే అర్హులైన పోడుసాగుదారులందరికీ హక్కుపత్రాలను అందజేస్తామని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన పోడు హక్కుపత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాగులో ఉన్న భూములకు పూర్తి స్థాయిలో హక్కుపత్రాలను ఇవ్వడం లేదని, అర్హత ఉన్నప్పటికీ అనర్హులమంటూ అధికారులు పోడు దరఖాస్తులను బుట్టదాఖలు చేస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హక్కుపత్రాలు పొందిన భూముల్లో పనులు చేసుకుంటే అధికారులు సాగుదారులను బెదిరింపులకు గురి చేస్తున్నారని, ఈ తరహా వ్యవహారానికి స్వస్తి పలికి సాగుకు ఆటకం కలుగకుండా చూడాలన్నారు. తహసీల్దార్ బి.భరణిబాబు, ఎంపీపీ గీదా కోదండరామయ్య, జెడ్పీటీసీ ఇర్పా శాంత, సర్పంచ్‌లు సోడి చలపతి, ఎలకం నరేంద్ర, సరియం రాధ, సోడి కృష్ణవేణి, మడవి సంధ్య, కారం కన్నారావు, బెండబోయిన నారదాలక్ష్మి, కనితి బాలకృష్ణ, టీపీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాదరావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఆవుల విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు కారంపూడి సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

'కూనంనేని' అరెస్ట్‌కు నిరసన



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

భద్రాచలంఅర్బన్: వరంగల్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు నిరసన కార్యక్రమాన్ని అడ్డుకొని అరెస్టు చేయడం నిరసిస్తూ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్లో నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి ఆరోజు సునీల్ కుమార్ మాట్లాడుతూ... తెలంగాణకు రావాల్సిన విభజన హామీలు అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. భద్రాచలం పట్టణానికి ఆనుకొని ఉన్న ఐదు గ్రామపంచాయతీలు తెలంగాణకు ఇవ్వాలని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారెడ్డి శివాజీ, బత్తుల నరసింహులు, హిమాం ఖాసిం, కల్లూరి శ్రీరాములు, ఎస్‌కె.ఖాదర్, డానియల్ ప్రదీప్, బద్ది బాబి, శోభన్, వింజం నాగసాయి, అయినాల రామకృష్ణ, కొలిపాక శివ, థామస్ పాల్గొన్నారు.

బియ్యం వితరణ..

మణుగూరు రూరల్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన రాజుపేట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ సిరికొండ శ్రీనివాస్ కుటుంబానికి శుక్రవారం విఠల్‌రావునగర్ సీఆర్‌పీఎఫ్ జవాన్ గుగులోత్ రమేష్, సింగరేణి రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు క్వింటా బియ్యాన్ని వితరణగా అందజేశారు. సింగరేణి సేవా సమితి సభ్యులు నాసర్‌పాషా, సింగరేణి రైల్వేకాంట్రాక్ట్ కార్మికులు మంగీలాల్, వీర్రాజు, శంకర్‌నాయక్, గోపి, శివరామకృష్ణ పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు వేతనాలు పెంచాలి

గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలని పలువురు నాయకులు అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని జీపీ కార్మికులు చేస్తున్న సమ్మె శుక్రవారం కొనసాగింది. ఈ మేరకు పలు పార్టీల నాయకులు సమ్మెలో కూర్చుని మద్దతు తెలిపారు. అధికారులకు కార్మికులతో కలిసి వినతిపత్రాలు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో సమ్మెలో పాల్గొన్న కార్మికులు



బూర్గంపాడు: మద్దతు తెలుపుతున్న నాయకులు



అశ్వారావుపేటరూరల్: వినతిపత్రం అందజేస్తున్న జీపీ కార్మికులు